ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది : 05-11-2026 **సమయం : 1.20 గంటలు**

ముఖ్యాంశాలు

1. **రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.**

2. **రాష్ట్రంలో 2 వేల 721 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి పాఠశాల విద్యాశాఖ డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.**

3. **రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి - ఏపీఈఆర్సీ నూతన చైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి బినోయ్ కుమార్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.**

4. **ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలోని బాపట్ల, నెల్లూరు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి.**

==========

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం గుంటుపల్లిలో కేంద్రీయ విద్యాలయంలో ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఈరోజు సందర్శించి ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ అభ్యర్థుల తరఫున పోలింగ్ ఏజెంట్లు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ కొనసాగుతోందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా పేర్కొంటూ..

..వాయిస్.. 27 సెకన్లు

రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. రాష్ట్రంలో మొత్తం 659 జడ్పీటీసీ, 9 వేల 821 ఎంపీటీసీ స్థానాలకు గాను ఇప్పటికే 77 జడ్పీటీసీ, 2 వేల 51 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమవ్వగా మిగిలిన 582 జడ్పీటీసీ, 7 వేల 767 ఎంపీటీసీ స్థానాలకు ఈరోజు పోలింగ్ జరుగుతోంది. ఉదయం ఏడు గంటల ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం ఐదుగంటల వరకు కొనసాగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 2.61 కోట్ల

మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఎన్నికల సంఘం వివరాల ప్రకారం ఉదయం 11 వరకు 21.12 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా మార్కాపురం జిల్లాలో 34.66 శాతం పోలింగ్ నమోదవ్వగా, అత్యల్పంగా అల్లూరిసీతారామరాజు జిల్లాలో 11.81 శాతం నమోదైంది. కాగా ఎన్నికల పోలింగ్‌లో కృష్ణాజిల్లా మచిలీపట్నంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ

వాయిస్ ..30.. సెకన్లు

రాష్ట్రంలో జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పలువురు మంత్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఓటు వేశారు. అదేవిధంగా శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని ప్రభుత్వ పాఠశాలలో కుటుంబ సభ్యులతో కలిసి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మరోవైపు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయనగరంలో తన ఓటు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఎన్టీఆర్ జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి 992 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సరళిని ఈరోజు ఆయన పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 16 జడ్పీటీసీ, 276 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ జరుగుతుందని వెల్లడించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణ కోసం వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాలుఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని లక్ష్మీశ తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

రాష్ట్రంలో 2 వేల 721 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి పాఠశాల విద్యాశాఖ డీఎస్సీ నోటిఫికేషన్ ను విడుదల చేసింది. ఈ నెల 11వ తేదీ నుంచి 30వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. డిసెంబర్ 20వ తేదీ నుంచి జనవరి 13వ తేదీ వరకు కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. అభ్యర్థుల కోసం డిసెంబర్ 5వ తేదీన ఆన్‌లైన్ మాక్ టెస్ట్ నిర్వహించనున్నారు. డిసెంబర్ 14వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. పరీక్షల తేదీలు, షెడ్యూల్ వివరాలను అధికారిక వెబ్‌సైట్ tet2dsc.apcfss.inలో అందుబాటులో ఉంచనున్నామని విద్యాశాఖ వెల్లడించింది.

మురసు తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ముంపునకు గురైన

ప్రాంతాలను పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నిన్న పరిశీలించారు. పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ సమీపంలో దుకాణాల్లోకి వర్షపు నీరు చేరి సరుకులు దెబ్బతినడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి – ఏపీఈఆర్సీ నూతన చైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి బినోయ్ కుమార్ ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నెల 3న రాష్ట్ర ప్రభుత్వం ఆయనను చైర్మన్‌గా నియమించగా విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ ఆయనతో ఈరోజు ప్రమాణ స్వీకారం చేయించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ఐదేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని నంద్యాల మెప్మా సిటీ మిషన్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి సూచించారు. బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా నంద్యాల బొమ్మలసత్రంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీ వరకు వారోత్సవాలు కొనసాగుతాయని, ప్రతిరోజూ ఒక్కో అంశంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. శారీరక వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, చిరుధాన్యాల వినియోగం, ప్లాస్టిక్ నిషేధం, ఎలక్ట్రానిక్ వ్యర్థాల తగ్గింపు, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు.

ఏలూరు జిల్లా పెద్దవాగు వరద ఉధృతిలో చిక్కుకున్న 22 మంది కూలీలను జిల్లా యంత్రాంగం సురక్షితంగా రక్షించింది. బుట్టాయిగూడెం మండలం రెడ్డిగణపవరం, కనకపురం గ్రామాలకు చెందిన కూలీలు పామాయిల్ తోటల్లో పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా జీలుగుమిల్లి రౌతుగూడెం వంతెన వద్ద వరదలో చిక్కుకున్నారు. వరద ఉధృతికి వంతెన రహదారి కొట్టుకుపోవడంతో వారు అక్కడే చిక్కుకుపోయారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి దృష్టికి తీసుకెళ్లగా పోలీస్, విపత్తు బృందాల సిబ్బందిని అప్రమత్తం చేసి సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీ సహాయంతో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న 22 మంది కూలీలను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారని అధికారులు తెలిపారు.

తూర్పు తెలంగాణ, పరిసర కోస్తాంధ్ర ప్రాంతాల్లో కొనసాగుతున్న అల్పపీడనం బలహీనపడిందని, దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమలో ఈరోజు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా.. రాష్ట్రంలోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, బాపట్ల జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. బాపట్ల జిల్లాలోని చినగంజాంలో భారీ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

రష్యా సైన్యంలో ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేస్తున్న అక్రమ ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. ముఖ్యంగా ఉత్తరాంధ్రకు చెందిన నిరుద్యోగ యువతను అధిక వేతనాలు, ఉద్యోగాల ఆశ చూపి రష్యాకు పంపిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

==========